క్లుప్తంగా

లాసెట్‌లో భవ్యశ్రీకి రాష్ట్ర స్థాయిలో 22వ ర్యాంకు



జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన లాసెట్ ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన సంకా భవ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో 22 వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి శ్రీనివాసరావు వ్యాపారి. పదవ తరగతి వరకు జగ్గయ్యపేట పట్టణంలో చదివిన భవ్యశ్రీ ఇంటర్మీడియెట్ కంచికచర్లలో చదివింది. ఐదు సంవత్సరాల లా సెట్ ఎంట్రన్స్‌లో 22 వ ర్యాంకు సాధించింది. భవిష్యత్‌లో కార్పొరేట్ లాయర్ కావాలన్నదే తన జీవిత లక్ష్యం అని భవ్యశ్రీ తెలిపింది.

వసతి గృహంలో ప్రవేశాలపై ఎంపీపీ ప్రచారం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. అడ్మిషన్లకు సంబంధించి గురువారం మండలంలో వసతి గృహ వార్డెన్ స్వామి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో నాణ్యమైన భోజనంతో పాటు పుస్తకాలు, దుప్పట్లు అన్నీ ఉచితంగా ఇస్తారన్నారు. వార్డెన్ స్వామి మాట్లాడుతూ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రవేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కీసర లోకేశ్వరరావు, జక్కులూరి దేవదాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు శంభులింగేశ్వరుని ఆలయ వార్షికోత్సవం



నందిగామ రూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో ఉన్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చావా అర్జునరావు తెలిపారు. మహోత్సవాలలో భాగంగా గణపతి పూజ, 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పుష్ప, బిల్వార్చనలను వేదోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి వారి దివ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం పెంపొందించుకోవాలి



పెనుగంచిప్రోలు: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర యోగా సాధన వలన విద్యార్థుల్లో తెలివి తేటలతో పాటు సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఈనెల 21న జరిగే సామూహిక యోగా వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎ కె.జలజ, యోగా శిక్షకులు డాక్టర్ దుర్గామల్లేశ్వరరావు, కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరునికి లక్ష మల్లెల పూజ

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారికి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా గురువారం ఆలయ అర్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు విశేష అభిషేకాలు, లక్ష తులసి, లక్ష మల్లెల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎన్వీ సాంబశివరావు, ఆలయ చైర్మన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 22 వ వార్డు, నాగమయ్య బజారులోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి బదిలీపై వెళుతున్న విజయసారధిని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విజయసారథితో పాటు, ఆయన స్థానంలో నూతన హెచ్ఎంగా బదిలీపై వచ్చిన చంద్రశేఖర్‌ను కూడా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగికి సత్కారం

పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో దాదాపు 10 ఏళ్ల నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.రాము విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో ట్రెజరీ సిబ్బంది, డీడీవో రామును ఘనంగా సత్కరించారు. రాము స్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన శృతికి ట్రెజరీ సిబ్బంది, డీడీవో స్వాగతం పలికారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- కంచికచర్ల మండలం గండేపల్లి సుబ్బరాజు చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు
- రేయింబగళ్లూ నిరాటంకంగా తరలిస్తున్న మట్టి
- రోజుకు 100 లారీలకు పైగానే తరలిస్తున్న మాఫియా
- నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల అండతో తెగబడుతున్న వైనం
- వెంచర్లకు అక్రమంగా తరలిస్తున్న చెరువు మట్టి
- పెద్ద పొక్లెయిన్‌తో లోతుగా తవ్వకాలు
- ముడుపుల మత్తులో జోగుతున్న ఇరిగేషన్ అధికారులు



గండేపల్లి సుబ్బరాజు చెరువు నుంచి రాత్రి సమయంలో వెంచర్లకు మట్టిని తరలిస్తున్న లారీ

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలోని కృష్ణా, మునేటి పరివాహక గ్రామాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతుంటే, పచ్చని పల్లెల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. అధికారుల అలసత్వాన్ని ఆసరా చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియాకు ఇప్పుడు మట్టి మాఫియా కూడా తోడవటంతో ప్రకృతి సంపద హారతి కర్పూరంలా కరిగిపోతోంది. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మట్టి మాఫియా పేట్రేగిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని వెంచర్లకు, అనుమతులు లేని పొలాలకు తరలించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. తమ ప్రమేయం లేకుండానే చెరువుల్లో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నామని అధికార పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి సుబ్బరాజు చెరువులో ఓ అధికారపార్టీ నాయకుడు పెద్ద పెద్ద పొక్లెయిన్‌లతో పెద్దపెద్ద లారీలతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లక్షలు కొల్లగొడుతున్న తెలుగు తమ్ముళ్లు..

ప్రకృతి సంపదను దోచుకునేందుకు కూటమి నేతలు అక్రమార్జనకు తెరతీశారు. చెరువులు, గుంటల్లో మట్టిని విక్రయిస్తూ తెలుగు తమ్ముళ్లు లక్షలు కొల్లగొడుతున్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి, గొట్టుముక్కలలో చెరువుల్లో పొక్లెయిన్ వంటి భారీ యంత్రాలను ఉపయోగించి రోజుకు వందల సంఖ్యలో పెద్దపెద్ద లారీలతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. చెరువులో మట్టిని లోడ్ చేసేందుకు ట్రక్కు మట్టిని రూ.1000 నుంచి రూ.1,500 వరకు, లారీకి రూ.3వేల నుంచి రూ.4వేల వరకు విక్రయిస్తూ అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు..

ఎటువంటి అనుమతులు లేకుండా గండేపల్లి సుబ్బరాజు చెరువులో భారీ గోతులు పెట్టి మట్టిని తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో నీటిని తాగేందుకు చెరువులోకి దిగిన మూగజీవాలు సైతం భారీ గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో మట్టి తోలుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియా నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు లక్షల్లో ముడుపులు అందుకుంటున్నారని, అందుకే తమ పార్టీ నాయకులు మట్టిని అమ్ముకుంటున్నా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదని తెలుగు తమ్ముళ్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయటంతో పాటు మట్టి రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఏఈ రాజేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులో లేరు.

రైతులు ఇచ్చిన సర్వే నంబర్లకు మాత్రమే అనుమతులు ఇచ్చాం

గండేపల్లి సుబ్బరాజు చెరువులో రైతుల పొలాల్లో మట్టి తోలుకునేందుకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. 5వేల క్యూబిక్ మీటర్ల లోతు మాత్రమే చెరువులో మట్టిని తీసి రైతులు ఉపయోగించుకోవచ్చు. ఇతర గ్రామాలకు వెంచర్లకు తోలేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. కేవలం గ్రామంలోని సర్వే నంబర్లు 108-3,116-3,125-5ఏ,127-5సీ,128,119-3273-4128-2ఏ,276-1,128ఏ3,121-1154-1కు అనుమతులు ఇచ్చాం. ఇతర గ్రామాలకు గాని, వెంచర్లకు గాని మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. కీసర గ్రామానికి మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. వాటిని నిలిపివేస్తాం.

-రాజేష్, ఇరిగేషన్ ఏఈఈ, కంచికచర్ల

మా పాఠశాలలు మాకు కావాలి



చిల్లకల్లు ఎంఈవో కార్యాలయం వద్ద టీడీపీ నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

టీడీపీ నాయకులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ''ఎంతో కాలంగా తమ పిల్లలు సంతోషంగా తమ కళ్లెదుటే తమ గ్రామంలోనే ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకునే వారు. కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో తమ పిల్లలు కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అటువంటి ఆలోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలి. మా ఊళ్లో పాఠశాలలు మాకు మళ్లీ కావాలి'' అంటూ పలు గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఎంఈవో కార్యాలయం వద్ద గురువారం మండలంలోని ధర్మవరప్పాడుతండా, తక్కెళ్లపాడు, రావిరాల, కె.అగ్రహారం, వేదాద్రి, అన్నవరం గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు తొలగించటంపై స్థానిక టీడీపీ నాయకులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

12 కి.మీ దూరం నడిచి వెళ్లాల్సివస్తుంది

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు తొలగించటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా ధర్మవరప్పాడుతండా, తక్కెళ్లపాడు, అన్నవరం గ్రామాల్లో తరగతులు తొలగించటం వల్ల విద్యార్థులు 10 నుంచి 12 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత విద్యార్థులంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులని, ఇలా చేయటం వల్ల వారంతా పలు రకాల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాల విలీన సమయంలో గ్రామాల్లోని తల్లిదండ్రులకు, విద్యాకమిటీ చైర్మన్, సభ్యులకు కనీస సమాచారం లేకుండా తొలగించారన్నారు. దాదాపు గంటపాటు ఆందోళన నిర్వహించారు. ఆ సమయంలో కార్యాలయంలో ఎంఈవో-2 చిట్టిబాబు ఉండటాన్ని గమనించి కార్యాలయంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా ఆయన బయటకు వచ్చి ప్రభుత్వ ఆదేశాల మేరకే తరగతులు తొలగించామని వివిధ గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ కూడా చేశామని చెప్పటంతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. తమ అభిప్రాయాలు ఎప్పుడు తీసుకున్నారని, తప్పుడు నివేదికలు ఇచ్చి తరగతులు తొలగించారని ఎంఈవోను చుట్టుముట్టడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో స్థానిక టీడీపీ నాయకులు జోక్యం చేసుకుని విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని చెప్పటంతో సమీపంలోని ఎంపీడీవో కార్యాలయం వద్దకు వెళ్లి ఎంపీడీవో నితిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న ఎంఈఓను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గింజుపల్లి రమేష్, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, సర్పంచ్‌లు పేరయ్య, శ్రీనివాసరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా దాసాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో దర్శనమిస్తున్న దాసాంజనేయ స్వామి

నందిగామ రూరల్: పట్టణంలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయ ఏడవ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు, ధన్వంతరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామి వారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు, తిరువంజనం, తమలపాకు, అరటి పండ్లు, పలు రకాల ప్రత్యేక పుష్పాలతో అష్టోత్తర సహస్ర నామ పూజలను వైఖానస సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. లలితా విష్ణు జ్ఞాన వాహిని మహిళా సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. రాత్రికి ముక్కోటి మహా మండపంలో పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించి మంటపంలో వేద మంత్రోచ్చరణల నడుమ సువర్చల, ఆంజనేయ స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎన్ఆర్ఐ అమూల్య తండ్రి జోజిరెడ్డి, ఎంఈఓ

గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల ఎంపీపీ స్కూల్‌లో ఎన్ఆర్ఐ గోపు అమూల్య తన తండ్రి జోజిరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారని హెచ్ఎం అమర్లపూడి జేమ్స్ తెలిపారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు పేద, మధ్య తరగతికి చెందిన వారేనని, వారికి పుస్తకాలు అందజేసేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం జోజిరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి శ్రీనివాసరావు, అక్కల అంజిరెడ్డి, జయరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

98 శాతం రైతుల ఈకేవైసీ పూర్తి

సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో 98 శాతం రైతులకు ఈకేవైసీ పూర్తయిందని ఏడీఏ భవాని గురువారం తెలిపారు. ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో ''అన్నదాతకు అగచాట్లు'' అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. నియోజకవర్గంలో 21,586 మంది రైతులకు గాను ఇప్పటికే 21,026 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. రైతులు ఏ పథకంలో అయినా ఈకేవైసీ పూర్తి అయినట్లయితే అధికారులు వారి డేటాను అన్నదాత సుఖీభవ పథకానికి అనుసంధానం చేస్తారన్నారు. రైతులు మరలా ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేవలం అందుబాటులో లేని 560 మంది రైతుల ఈకేవైసీ నమోదు కోసం రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. వారి జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

విద్య ద్వారానే సమాజ అభివృద్ధి

ఎంపీపీ మార్కపూడి గాంధీ



కె.పొన్నవరంలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గాంధీ

కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మారిందని, పేద ప్రజలకు కార్పొరేట్ స్కూల్స్‌లో అందించే సౌకర్యాలు అందించారన్నారు. హెచ్ఎం శ్రీలత, నాయకులు కీసర లోకేశ్వరరావు, జక్కులూరి దేవదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం - పొంచి ఉన్న ప్రమాదం

- ఏడాది క్రితం స్తంభం నుంచి జారి కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- భయాందోళనలో విద్యార్థులు, గ్రామస్తులు



గూడెం మాధవరంలో స్తంభం నుంచి జారి కింద పడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వీరులపాడు: మండలంలోని గూడెంమాధవరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి నెలలు గడుస్తున్నా విద్యుత్ శాఖాధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడాది కిందట గ్రామంలోని పలు కాలనీల బోర్లకు వినియోగించేందుకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆ సమయంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ స్తంభం నుంచి జారి కిందపడింది. అప్పటి నుంచి ఏడాది గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖాధికారులకు తీరిక లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా పాఠశాల, అంగనవాడీ కేంద్రానికి అత్యంత సమీపంలో ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు విద్యార్థులు కాలినడకన వెళ్లి వస్తుంటారని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా ఇదే మార్గంలో మేతకు ప్రతి రోజు పశువులు పంట పొలాలకు వెళ్తుంటాయని పశుపోషకులు వాపోతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయటంతో పాటు ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యుత్ శాఖాధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పైపులైను లీకేజి మరమ్మతు పనుల పరిశీలన



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణానికి తాగు నీటి సరఫరా అవుతున్న ప్రధాన పైపులైన్ ముక్త్యాల రోడ్‌లో లీకేజీ ఏర్పడి బుధవారం నుంచి పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం సంబంధిత ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులకు ఇప్పటికే ఆదేశించామని తెలిపారు. సమస్య తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినందున త్వరితగతిన పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణ, నాయకులు మైనేని రాధా, బుజ్జిబాబు, మల్లెల కొండయ్య, గెల్లా వైకుంఠేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సచివాలయాల ఉద్యోగులు గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించి జీవో నంబరు 5 లో సొంత మండలంలో ఏ ఉద్యోగికీ పోస్టింగ్ ఇవ్వరాదనే నిబంధన ఉందన్నారు. అందువలన పట్టణ ప్రాంతంలో, ఆ పట్టణ రెవెన్యూ మండలం రూరల్‌లో నివసించే వార్డు సచివాలయ ఉద్యోగి అర్బన్ ప్రాంతంలో ఎప్పటికీ ఉద్యోగం చేసే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఉద్యోగులకు లేని నిబంధనలను చిరుద్యోగులమైన తమపై రుద్దటం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం మాదిరిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబరు5 ను సవరించి పట్టణాల్లో, సొంత వార్డు కాకుండా సచివాలయం నుంచి సచివాలయానికి బదిలీ అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని 14 సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యత పెంచాలి

దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ (ఎస్టేట్స్) భ్రమరాంబ



లడ్డూ ప్రసాదం నాణ్యత చూస్తున్న జాయింట్ కమిషనర్ భ్రమరాంబ, పక్కన ఈఓ కిషోర్‌కుమార్

పెనుగంచిప్రోలు: ప్రసాదాల నాణ్యత పెంచాలని దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ (ఎస్టేట్స్) భ్రమరాంబ అన్నారు. గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఆలయంలో ప్రసాదాల తయారీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అన్నదానం, పారిశుద్ధ్యంతో పాటు ఆలయ స్టోర్ రూమ్‌తో పాటు పలు రికార్డులను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వలు సరిచూశారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదం, పులిహోర ఆమె రుచి చూశారు. లడ్డూలో జీడిపప్పు, కిస్‌మిస్‌తో పాటు యాలుకలు కూడా సమంగా ఉండాలన్నారు. యాలుకల రుచి సరిగా లేదన్నారు. పులిహోరలో కూడా కొంచెం మిరియాల ఘాటుతో పాటు నూనె కొంచెం ఉండాలని సిబ్బందికి సూచించారు. భక్తులకు ప్రసాదాలు విక్రయించే కౌంటర్‌లో 12 గంటల లోపే పులిహోర ప్రసాదం లేదనటం సరైనది కాదని అన్నారు. ఆలయ స్టోర్ రూమ్‌లో సరుకులు బస్తాల్లో కాకుండా టబ్‌ల్లో కనిపించే విధంగా ఉండాలన్నారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 22 ప్రధాన ఆలయాల్లో అమలు జరుగుతున్న ప్రసాదాల తయారీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రొవిజన్స్, శానిటేషన్ తదితర అంశాలపై తనిఖీలకు దేవదాయ శాఖ అధికారులను నియమించిందన్నారు. తాను ప్రసాదాల తయారీ, సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించి రాష్ట్రంలో నోడల్ అధికారిగా కూడా ఉన్నాన న్నారు. ఆలయాల్లో అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి కమిషనర్‌కు నివేదిక అందిస్తామన్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో వంటశాల, ప్రసాదాల తయారీ గదిలో చేయాల్సిన మార్పులు అధికారులకు సూచించామన్నారు. తాను పెనుగంచిప్రోలుతో పాటు మోపిదేవి, ద్వారకా తిరుమల ఆలయాల్లో తనిఖీలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ

నందిగామటౌన్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 28 లోపు కౌన్సెలింగ్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని, 21 నుంచి 28వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఐచ్ఛిక నమోదుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. జూలై ఒకటిన ఐచ్ఛికాల మార్పులు, జూలై మూడున సీట్ల కేటాయింపు జరుగుతుందని సీట్లు పొందిన విద్యార్థినులు జూలై నాలుగు నుంచి ఎనిమిదవ తేదీలోగా కళాశాలల్లో చేరాల్సి ఉంటుందన్నారు. నందిగామ సరిసర ప్రాంత విద్యార్థినులకు విజయవాడలో మూడు కౌన్సెలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, ర్యాంకును బట్టి ఆయా కేంద్రాల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థినులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు రూ.250 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రశీదు పొందాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలి

నందిగామ టౌన్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని యోగా గురువు కిలారు ప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సుజనా ఫౌండేషన్ కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న యువతతో గురువారం ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా గురువును యువత, ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, పలువురు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ప్రకటన

Mrs. Shriram Finance Ltd. ...

రాయపూడి శ్రీనివాసరావు
తేది 19-06-2025

ప్రకటన

Mrs. Shriram Finance Ltd. ...

రాయపూడి శ్రీనివాసరావు
తేది 19-06-2025